# దేవుడున్నాడా?

'వొంకర టింకర వయసే సక్కన' అంటూ తెలంగాణా ప్రాంతాల్లో వో నానుడి జన సామాన్యంలో బహుళ ప్రచారాన్ని పొందింది. నాగరికత ముదిరిన ఈ రోజుల్లో కూడా వెనకటి తరం వాళ్ల నాలుకలపై ఈ వాక్యం యింకా ఆడుతూనే వుంది.

ఏదో అలవోకగా వింటూ వుంటే యిదేమంత ఆలోచించతగింది గాక, వుట్టి కరకర శబ్దంలా కన్పిస్తాంది. కానీ

దాని గుండెల్లో నిండుకున్న అర్థాన్ని గ్రహించినప్పుడు, హృదయకుహరంలో సురభిళమైన రసపట్టును దాచుకున్న మొగలి మొగ్గలా ఆనందాన్ని పంచుతుంది. ఈ సామెత ఆధారంగానే నా మనస్సులో మరో యధార్థ విషయం, సామెత రూపంలో తారట్లాడింది. అదే! పదవికి సంబంధించిన విషయం. అందుకే నేనూ 'వంకర టింకర పదవే చక్కన' అంటూ ఈ సామెతకు దీటుగా ఉపయోగించాలని అనిపించింది. అలా అని నా కొక్కర్తెకే తోస్తే సరిపోతుందా? అది అందరి నోటా నానాలి. నిత్యవ్యవహారంలో స్థిరపడాలి. అప్పుడు గాని దానికి ప్రయోగ సిద్ధి లభించదు. 'పదుగురాడు మాట పాటియై ధరజెల్లు' అంటూ వేమన వూర్కే అన్నాడా?

ఇంతకూ యీ మాట ఎందుకంటున్నానంటే? మొన్న మొన్ననే ఓ పదవీ కిరీటం నా తలను అలంకరించింది లెండి. యిక ఆనాటినుంచి నా వ్యక్తిత్వం కొత్త కోహళి సింగారించి నా అర్హతలు గోరంతలు కొండంతలై అన్నింటా నేనే కనిపించడం ప్రారంభించాను. నా పలుకుబడి పునుగు వాసనలా అన్ని మూలలకూ వ్యాపించడం మొదలైంది. యింకేం?

ప్రారంభాలకు, వుద్ఘాటనలకు విమోచనలకు, ఆవిష్కారాలకు, నేనే! ఇక నా వుపన్యాసం? అబ్బో! అది శిఖరాగ్రాలనుండి దుమికే కొదమ ప్రాయపు ఝరి. కర్ణపేయమైన సంగీతంలా మైమరిపించే రసవాహిని. అందుకే జనం స్వాతి చినుకులకోసం వేచి వున్న ముత్తెపు చిప్పల్లా కాదు ఆలు చిప్పల్లా వేచి కూర్చుంటారు. నేను రాక తప్పదు.

అవును నేను వెళ్లకపోతే ఎలా? తప్పక వెళ్లాలి. మరి? అడుగడుగునా, గంటగంటకో కొత్త విషయాన్ని గూర్చి మాట్లాడుతూ న్యాయం చేయగలనా? ఎలా? - ఎలా ఏమిటి? ప్రస్తుతం నీవెవరో గ్రహించావా ? నీవు అధిరోహించిన కుర్చీ విలువ ఎంతో అంచనా వేసుకున్నావా? అంటూ నన్నెవరో ప్రబోధించారు. వెంటనే నా మనస్సు పురి విచ్చిన నెమలిలా షోకులు పోతూ అదెంత పని? పెద్దగా యిందాకటిలా శ్రమ పడాల్సిందేమీ లేదు. విస్సన్న చెప్పిందే వేదం. ఒకే టేపురికార్డు. సమయ సందర్భాలను పురస్కరించుకుని అటూ, యిటూ, పేర్లూ అవీ మారుస్తే చాలు బ్రహ్మాండమైన వుపన్యాసం తయారౌతుంది. కరతాళ ధ్వనులు మిన్ను ముట్తాయి. నా కీర్తి వూరూ వాడా పట్టణం పల్లెలన్నీ దాటుతూ నదీ పర్వతాలను చుడ్తుంది.

అందుకే అంటున్నాను. నిజమైన అర్హతలు వున్నా లేకపోయినా 'పదవి' అనే వజ్రాయుధం చేతిలో వుంటే చాలు. ప్రాణం పోయనూ వచ్చు. తీయనూ వచ్చు. ఈ సత్యదృష్టే నాలో 'వంకర టింకర పదవే చక్కన' అనే నిజాన్ని ఆవిష్కరించింది. ఇక మీరు ఈ సుభాషితాన్ని నానుడిగా వాడుకోవచ్చు. జానపద సాహిత్యానికి మూలస్రోతను తెలిసికోవడం కష్టం. అలాగే యీ సామెత కూడా స్వయం వ్యక్తంగా అవసరానికి అక్కరకు వస్తుంటుంది. 'ఊరేగింపు వూరంతా తిరిగి బొడ్రాతి కాడికి వచ్చె' అన్నట్లు మళ్లా నేను నా రాకపోకల దగ్గరకే రావాల్సి వస్తుంది.

మొన్న అనుకోకుండా వో సాంస్కృతిక సంస్థ వారు జరుపుకునే తొలి వార్షికోత్సవ సభకు గౌరవ అతిథిగా రాజమండ్రి వెళ్లవలసిన అగత్యం ఏర్పడింది. ఈ మధ్యలో విచిత్ర వస్తు సంచయం, పెరిగినట్లే ముఖ్య అతిథి అనే పదవికి పిలకలు పుట్టినట్లు ఆ శబ్దానికి తోడుగా విశేషణాలెన్నో చేరుతూ పదవుల దండలా ఏర్పడింది. ఈ వరుసలో ముఖ్య అతిథికి తోడుగా వెలసిన పదరాజం యీ గౌరవ అతిథి అనే పదం. దీని వెంట బన్న సరానికి తోడుగా వెలిగే కంఠాభరణ విశేషం అంటే? టూకీగా చెప్పాలంటే అడ్డిక లా ముఖ్య అతిథి వెంట వేదికను అలంకరింపదగిన కోవలోనిది. పిలువదగిన పెద్దలను సాధ్యమైనంత వరకు ఆహ్వానించి వేదికను జేగీయమానంగా వెలిగించి ఆ గొప్పవారి ప్రసన్నతలను పొందడానికి కనిపెట్టిన సుకర సంపాదితమైన చిన్నపాటి చిట్కావంటిది.

సుకరం ఎందుకటున్నానంటే? కేవలం వేర్వేరు వుపసర్గలతో బహూకృతం చేస్తూ వీలైనన్ని కుర్చీలను వేదికపై ఎక్కించడానికి వీలు కల్పించే పదవీరాజం యిది.

ఇలా తప్పనిసరిగా వెళ్లవలసి రావడంతో అంతవరకే వో ప్రోగ్రాంకు నన్ను బుక్ చేసుకున్న కార్యకర్తగారు ఎంతో ఆందోళన పడ్తూ తిరుగు టపాలో వెంటనే వుత్తరం పంపుమన్నా ధోరణిలో రేపు వుదయం పదిగంటల పదినిముషాలకల్లా అతి ముఖ్యమైన నన్ను, ముఖ్యాతి ముఖ్యమైన నన్ను పంపవలసిందిగా మరీ మరీ చేతులు జోడిస్తూ రాజమహేంద్రవరపు కార్యదర్శిగారికి అవసరమైన పానీయం అదీ యిచ్చి మరీ మరీ పర్సనల్ రిక్వెస్టుగా కోరారట.

అబ్బ! అప్పుడు రాజమండ్రి వారి దృష్టిలో నేను మరీ అపురూపంగా మారిపోయాను. ఇంత యిదా? అలా అని తెలిస్తే ముఖ్య అతిథిగానే అహ్వానించేవాళ్లమే? అంటూ బాధపడిపోయారు.

అంతకు ముందే యీ పదవుల తారతమ్యాల గూర్చి 'ముఖ్య, అతి ముఖ్య' గౌరవ శబ్దాల హెచ్చుతగ్గుల గూర్చి కార్యవర్గ సమావేశంలో తర్జన భర్జనలు జరక్కపోలేదు. ఆ చర్చలో 'ముఖ్యశబ్దమే తొలి సృష్టి, ఆవల విశ్వామిత్ర సృష్టిలా గౌరవ శబ్దం వచ్చి చేరింది. కాబట్టి కాలక్రమంతో గౌరవం కన్నా, ముఖ్యానికే ప్రాముఖ్యం ఎక్కువ అంటూ తీర్మానింపబడింది.

ఈ మాట ఎక్కడ నా చెవిలో పడ్తే రానంటూ భీష్మించుక్కూర్చుంటానో? అంటూ జాగ్రత్తలు పడ్డారు పాపం.

ఇలాంటి పోటాపోటీల్లో నేను తెలుగునాట తెలుగును నిలిపిన చాళుక్యవిభుల రాజధానీ నగరమైన రాజమహేంద్రవరం వెళ్లి కార్యక్రమాన్ని దిగ్విజయంగా ముగించుకుని మళ్లా హైదరాబాదుకు ప్రయాణం కట్టాను.

ఖర్చులు అంచనాను మించిన కారణంతో కార్యకర్తగారు నీళ్లు నములుతూ 'అమ్మా క్షమించండి సమయాభావంతో ఫస్ట్‌క్లాస్‌లో రిజర్వేషన్ కష్టమైంది. మీకు కేవలం స్త్రీలకు మాత్రమే ప్రత్యేకింపబడ్డ పెట్టెలో తిరుగుప్రయాణం ఏర్పాటు చేశాం' అంటూ సవాలక్ష క్షమాపణలతో నన్ను ఆ ప్రత్యేకమైన డబ్బాలో ఎక్కించారు.

ఎక్కి కూర్చున్నాను. రైలు కూతబెట్టి నడక ప్రారంభించిన తరువాత స్థిమితంగా పెట్టె అంతా కలియచూశాను. సంఖ్యలో అయిదుగురు తేలారు. ఆ పెట్టెలో వున్నవాళ్లంతా నా లా అరవై ఐదేళ్ల దరిదాపుల్లో వాళ్లే. పైగా యిప్పటి నవనాగరికతలూ, చలాకీలు తెలియని వారులా కనిపించారు. కాలేజీ చదువులు లేని కారణంగా అత్యాధునికమైన వింతపోకడల వాసనలు తెలియక మంచి సంప్రదాయికమైన కుటుంబాల తర్ఫీదుల్లో తలలు పండిన వారిలా కన్పిస్తున్నారు.

వీళ్లంతా ఒకవేళ అవసరం వస్తే రైలుపెట్టెలోంచి కిందికి దిగి మంచినీళ్లు కాని, టీ, కాఫీ, టిఫిన్‌లాంటివి కాని తెచ్చుకునే స్థితిలో లేరు. తాము దిగితే మళ్లీ తాము కూర్చున్న బోగీని వెతుక్కుని ఎక్కలేరు. ఏ స్టేషన్లో ఎంతసేపు ఆగుతుందో తెలియనివారు.

ఈ ఒక్క విషయంలో మాత్రం నాకూ నా తోటి ప్రయాణికులకు సామ్యం బాగా కుదిరినట్లనిపించింది. 'తెలియదూ' 'చేతకాదు' అనే మాటలు ఆ గృహిణులకు చెల్లుతాయి. కానీ, తెలియదంటే నాకెలా చెల్లుతుంది. పోనీలే, నా చేతగానితనాన్ని ప్రకటించడం ఎందుకంటూ గంభీరంగా వుండిపోయాను.

రాత్రి గడిచింది. తెల్లవారింది. అవసరాలు తీర్చుకున్న తరువాత వేడి వేడిగా ఏదైనా గొంతులో పడాలనిపించింది. ఈ కాల ప్రభావంతో అందరూ పుదయాన్నే టీ, కాఫీ గతప్రాణులయ్యారు. అయినా! దిగి కొనుక్కోవడానికి ఎవ్వరూ సాహసించక కళ్లన్నీ స్టేషన్‌వైపే పుంచి కబుర్లు చెప్పుకుంటూ కదలకుండా కూర్చున్నారు. ఇంతలో కాఫీ,కాఫీ, అనే కేక వినిపించింది. అందరికీ ప్రాణాలు లేచి వచ్చినట్లనిపించింది. కిటికీ పక్కనే కూర్చున్న సీతమ్మ మా అందరిలో కాస్త చిన్నదిలెండి. ఆ కుర్రాణ్ణి కేకవేసి పిలిచి కాఫీ అందుకున్నది. దాంతో ధైర్యాన్ని పుంజుకున్న బామ్మలూ, అమ్మమ్మలూ అందరూ కాఫీ తాగడానికి సిద్ధపడి తలా వో గ్లాసు అందుకున్నారు. వాళ్లతో పాటూ నాకూ ఎక్కడా లేని చొరవా ధైర్యం వచ్చి నేను కాఫీ అంటూ మరింత గట్టిగా పిలచి గ్లాసు అందుకున్నాను. ఎవరి చిల్లర డబ్బులు వారు ఇచ్చేశారు. మిగతా యిద్దరితో చిల్లరలేదు. మాలో ఎవ్వరిదగ్గరా చిల్లర లేదు. పాపం పార్వతమ్మగారు తన దగ్గరున్న పర్సులోంచి పదిరూపాయల నోటు తీసి 'మా యిద్దరి డబ్బు తీసుకు మిగతా పైకం వాపసు యివ్వ' మంటూ టీ కుర్రాడి చేతిలో పెట్టింది.

వాడు యిటూ అటూ ఆ జేబూ ఈ జేబూ తడుముకుని 'అమ్మగారూ! చిల్లర లేదండి! మీరెవ్వరన్నా యివ్వండి. అంటూ మా అందరినీ కలియచూశాడు.

మాలో ఎవ్వరిదగ్గరా చిల్లరలేదని తేలిపోయింది. అది ఆసరాగా తీసుకుని వాడు 'యిప్పుడే తెచ్చిస్తాను. ఈ రైలు వెంటనే వస్తున్నాను' అంటూ పది రూపాయలు పట్టుకువెళ్లాడు. చిటికెలో వస్తానన్నవాడు అత్తాపత్తా లేకుండా వెళ్లిపోయాడు. మేమంతా ఆత్రంగా వాడి రాకకోసం ఎదురు చూస్తూ వుండిపోయాం. రైలు 'కూ' అంటూ ముందుకుసాగింది. పార్వతమ్మ గారి పదిరూపాయల నోటు శాశ్వతంగా వాడి జేబులో వుండిపోయింది.

దాదాపు పన్నెండు గంటలపాటు వయసు మళ్లిన ఆడవాళ్లతో పాటు నిద్రించిన రైలు పెట్టె ఒక్కసారి మేల్కొన్నట్లు సజీవమైంది. మూగకు మాటలు వచ్చినట్లు గలగలమంటూ రెండువైపులా మాటలు జీవం పోసుకుంటున్నాయి. చర్చ విచిత్రంగా ప్రారంభమైంది.

విషయం? యింతదాక పార్వతమ్మగారు టీ కుర్రాడికిచ్చిన పదిరూపాయలకు సంబంధించిన న్యాయ నిర్ణయం.

ఇక్కడ డబ్బుపోయింది ఒక్కరిదే, అయినా; నష్టపరిహారం భరించవలసింది ఒక్కరా? ఇద్దరా? అందులో వెంకాయమ్మ గారి బాబతు రూపాయిన్నర అప్పుకూడా కలిసివుంది కాబట్టి.

పార్వతమ్మ తను యివ్వవలసిన రూపాయిన్నరకోసం పది రూపాయలిచ్చి అవి పోగొట్టుకుంటే అంత చిక్కుండేది కాదు. 'అయ్యో: పాపం అంటూ వో రెండు సానుభూతి వాక్యాలు రాల్చి వుండే వాళ్లం. కాని సమస్య అది కాదు. ఎదుటి వెంకాయలమ్మ యివ్వవలసిన రూపాయిన్నర కూడా కలిపి యిచ్చారు.

పాపం పార్వతమ్మ నష్టం భరించరానిదే! అయినా పెద్ద మనస్సుతో. పోనీలెండి బామ్మగారు, మీరు 'టీ' వాడికి యివ్వవలసిన రూపాయిన్నర మాత్రం యివ్వండి చాలు. మిగతాది నాదే పోయిందనుకుంటాను. అంటూ, అంతతో ఆగకండా,

'ఏదో? లేచిన వేళావిశేషం నష్టం కూచున్న పళానా భరించాల్సి వస్తుందని కలలుకన్నామా? అనుకోకుండా వచ్చి పడింది. ఏం చేస్తాం! అంటూ నిండు కుండలా వెలితి కనిపించకండా ప్రవర్తించారు పార్వతమ్మగారు.

ఈ తీర్పును విన్న బామ్మగారు అంటే వెంకాయమ్మగారు, ససేమిరా ఒప్పుకోరు. 'అమ్మాయ్! చూడూ! నా బాకీ తీర్చేందుకు కూడా నీవు డబ్బు ఇచ్చావ్. అప్రాచ్యపు వెధవ అలా దగా చేశాడు. మరి నష్టాన్ని యిద్దరం చెరీ సగం, సమానంగా పంచుకుందాం' అంటూ న్యాయాన్ని త్రాసులో తూచారు.

అయినా పార్వతమ్మ గారికి సమ్మతంగా లేదు. 'అవునూ, కాదు' అంటూ విచిత్రమైన ధోరణిలో తగాదా పడ్తున్నారు.

ఈ వివాదం వింటున్న నాకు మతిపోతూవుంది. ఇది అలనాటి రఘుకౌత్సుల వివాదంలా ఆశ్చర్యకరమై సాగుతూవుంది.

నిజానికి పెద్దావిడ మనస్సు పెద్దదే! కాని డబ్బుమాత్రం కొంగు ముడిలో దాచుకున్న ఐదు రూపాయల పచ్చకాగితం కన్నా మించి వేరేలేదు. వున్న ఐదు రాపాయలు నష్టపరిహారంగా చెల్లిస్తే,, స్టేషన్‌కి తన వాళ్లెవరూ రాకపోతే రిక్షా కట్టుకుని ఇల్లు చేరటానికి ఇబ్బంది పడవలసి వస్తుంది. అయినా సరే తన ఔదార్యానికీ నిండు తనానికి దెబ్బ తగలకూడదు. ఆమె పెద్దరికానికి ఏ వొంపూ కలగకూడదు.

వివాద విషయం స్పష్టపడే కొద్ది నాలో కనువిప్పు ప్రారంభమైంది. ఈ ఆధునిక వాతావరణంలో వున్నత విద్యావంతులం, వుత్తమ సంస్కారాన్నీ మానవతావాదాన్ని జీర్ణించుకున్న వాళ్లం అంటూ విర్రవీగే ఈ యువతరంలో ఎందరికి వుంది యీ సంస్కారం? స్వార్థం తప్ప పరహితం అనే చింతన ఏదీ? పరహితం అనే పెద్దపెద్ద మాటలు దేనికి? అయినా తాను త్యాగం చేయకపోయినా యితరులకు నష్టం కలిగించవద్దనే ధ్యాసే లేదు, కదా! అంటూ ఆలోచిస్తున్న కొద్దీ ఆ వెంకాయమ్మగారి ఎడ నా మనస్సు ఆర్ద్రమై, గౌరవం కూడా హెచ్చింది.

ఇంతింతకు గమ్యస్థానం దగ్గర పడబోతుంది. సమస్య సమస్యలాగే వుండిపోతూంది. అందరూ తలో మాట వోదార్పుగా చెబుతున్నారు. అదేదీ పరిష్కారం కాదు. కందు కందుగానే మిగులుతుంది. మచ్చ కనబడకుండా మాసిపోవాలి. అనుకుంటూ వుంటే ఎదుట అరటిపళ్లవాడు అరటి పళ్లు కేలా-కేలా అంటూన్న అమ్మకపు పాట వినిపించింది. అరటి పళ్లవాడిని కేక వేసి 'వో డజను పళ్లు కొన్నాను.' నా పాత చుట్టాల్లా తోటి వాళ్లను వరసలతో

పలకరిస్తూ అందరి ముందూ తలా రెండు పళ్ళుంచి 'పెద్దవారు పళ్ళు వద్దనకూడదంటూ', వారు మొకమాటంతో కాదనకుండా కట్టివేశాను.

సాదరంగా, సరసంగా సంభాషణ ప్రారంభమైంది.

ఓ రెండు నిమిషాలు ఆ యీ మాటల తరువాత వెంకాయమ్మగారిని వుద్దేశిస్తూ 'బామ్మగారు! మీది చాలా గొప్ప హృదయమండి! మీలాంటి వారు వుండబట్టే మన దేశంలో యింకా నీతి నిజాయితీల్లాంటివి వినిపిస్తున్నాయి. కాకపోతే యీ పందెపు పరుగుల్లో అనీతి ఏ మూలా కనిపించకుండా మూల్గుతూ కొనవూపిరితో ఆయాసపడుతూ వుండేది' అన్నాను.

ఆమె నిర్వికారంగా నా వైపు చూస్తూ 'నన్నలా మరీ ఆకాశానికి ఎత్తివేయకండి, నేను నాకు తోచిన న్యాయం చెప్పాను. పార్వతి నాకన్నా చిన్నవారు. నష్టాన్ని ఒక్కరిపై రుద్దడం ఏం న్యాయం' అన్నారు.

అప్పుడు నేను మరింత చొరవ తీసుకుంటూ -

'బామ్మగారు మీరు అంటున్నట్లే పార్వతి గారు మీకన్న చిన్నవారు, అందుకోసం ఆమె సరదా కూడా తీర్చాలి కదా! అందుకని మీరు నష్టపరిహారంగా సగం డబ్బు చెల్లించాల్సిన అవసరం లేదు. మా అందరిలానే మీ వంతు 'టీ' బాబతు రూపాయిన్నర యివ్వండి. స్టేషన్‌లో చిల్లర మార్పించి సర్దుకుందాం' అన్నాను.

నేను ఆ కొద్దిపాటి ఎందుకు సర్దివుండకూడదూ? అనే ఆలోచన కూడా రాకపోలేదు. అమ్మో! ఇంకేమన్నా వుందునా? ఆ యిద్దరూ నిప్పుల్లాంటి నిజాయితీ పరులు. అలాంటి వారిని కనికరించినట్లు ప్రవర్తించి వారి అభిమానాన్ని గాయపరచిన దాన్నవుతాను. డబ్బుతో కొనలేని ఆత్మౌన్నత్యం ఆ స్త్రీలది. అందుకే అలా పరిష్కరించవలసి వచ్చింది.

మా అందరికీ స్నేహబంధం ఏర్పడింది. ఈ విషయాన్ని పురస్కరించుకుని యిప్పటి మనుష్యులూ, మాట విలువలూ, మోసాలూ అమాయకతలూ, వేషాలూ ఎన్నెన్నో స్పృశిస్తూ అభిప్రాయ ప్రకటనలు సాగుతున్నాయి. ఇప్పుడు పెరిగిపోతున్న అవినీతికి కారణాల్లో ప్రధానమైంది. భయభక్తుల రాహిత్యం అంటూ సుబ్బమ్మగారు కాబోలు పేర్కొన్నారు.

ఆ మాటలు కొనసాగిస్తూ సుభద్రమ్మగారు 'నిజమేనండీ! ఇప్పటి తరంలో పూర్తిగా భగవంతుడిపై భక్తి నశించింది. దేవుడనేవాడు ఒకడున్నాడు అనే జ్ఞానం వున్ననాడు ఇలా బరితెగించిన నేరాలు మోసాలు చేయడు. పూర్తిగా పాపభీతి అనే మాట మాయమై పోతున్నట్లుంది' అన్నారు.

ఈ సంభాషణ సూత్రాన్ని అందుకుని వెంకయమ్మగారు - సుభద్రా! చూడు తల్లీ! నీవంటున్నది నిజమే! ఆదైవ భీతి లేకపోబట్టే కదా! ఆ పింజారీ వెధవ అలా పగటి దోపిడీ చేస్తూ వెళ్లిపోయాడు. తాను చేస్తున్నది మోసం, నమ్మక ద్రోహం అంటూ ఏ

కోశాన వున్నా వాడలా గడ్డితిని వుండడు, అన్నారు. ఆ మాటకు స్పందిస్తూ వెంటనే సుబ్బమ్మ గారు.

' వెంకాయమ్మ గారు మీరు నూరనండి, వెయ్యనండి. ఈ రోజుల్లో యింతకు దేవుడనే వాడున్నాడంటున్నారా? కనిపించని ఆ దేవుడెక్కడ వున్నాడండీ? వాడిని గూర్చి భయభక్తులు ప్రదర్శించడానికి?' అంటూ ఆధునిక ధర్మశాస్త్ర స్వరూపాన్ని ఆవిష్కరించారు.

ఈ మాటలు వినికిడికి కొత్తేం కాదు, అయినా అవి జాలువారిన స్థానాన్ని గూర్చి ఆలోచిస్తూ వుంటే నాతల గిర్రున తిరిగిపోతూవుంది. నేను వింటున్న మాటలు నిజమేనా? పావలా బిళ్లంత కుంకం బొట్టుతో వేలిముడితో, ఎత్తువంపుల లెక్కలతో పనిలేని నిండైన శరీరంతో నవనాగరికపు ఛాయలైనా సోకనివ్వని యీమె గారేనా? యీ మాట అంటున్నది. చార్వాకుని సిద్ధాంతాలనే తలదన్నే లా మాట్లాడుతున్నా రంటూ ఆటుపోటులకు గురైన సముద్రంలా నా శరీరంలోని ప్రత్యణువూ చకచికితమై రక్తప్రసరణం వేగాన్ని పుంజుకున్నది.

ఆ తరువాత కొంతసేపటి వరకూ ఎవరేమన్నారో? అంటున్నారో? తెలియలేదు. గొప్ప డిగ్రీలున్నాయంటూ మురిసిపోతూ నిత్యజీవితాన్ని వడబోస్తూ సంపాదించిన అనుభవంతో భావితరాలకు బాట చూపుతాం అని 'లీడరీ' బోర్డు కట్టుకు తిరిగేవాళ్లక్కూడా యింత ధైర్యం వచ్చి వుండదు. అంటూ నోరు మెదపకండా అవాక్కై చూస్తూ వుండిపోయాను.

ఇంతలోకే ఈ వాక్యాన్ని తలదన్నే మరో పిడుగులాంటి మాట నా చెవిని పడింది. ఆ మాటలు శేషమాంబగారి నోటినుండి రాలుతున్నాయి. యింతవరకూ ఎంతో నెమ్మదిగా కూర్చున్నారు శేషమాంబగారు. అసలు మాట్లాడ్డం వచ్చో? రాదో? అన్నంత ముభావంగా వున్నారు. కానీ మాట్లాడేందుకు వుపక్రమించడమే ' ఆటమ్‌బాంబు' లాంటి ప్రశ్నతో ప్రారంభించారు. ఆ ప్రశ్న ఘాటుగా, వాడిగా, వేడిగా, పదనుగా, అంటరానిదిగా లేదు. మామూలుగా, సున్నితంగా, సాధారణంగానే వుంది. అందులో వెటకారంలేదు. ఎత్తిపొడుపు లేదు. క్రౌర్యంలేదు. అసహ్యం లేదు. పగ అంతకన్నా లేదు. కానీ అది అన్ని సిద్ధాంతాలను తలకిందులు చేస్తూ తిప్పికొట్టే సామర్థ్యం కలిగి వుంది.

ఇందాకా 'దేవు' డంటూ వొకడువున్నాడా? అంటూ ప్రశ్నించిన వెంకాయమ్మను తిరిగిప్రశ్నించినట్లు మహామహులైన ఋష్యాదులకే తేలని సమస్య దేవుడు. ఈ దేవుడే యిన్ని రక్తపాతాలకు వైషమ్యాలకూ దారి తీస్తున్నాడ ంటారు. నమ్మిన వాడికి నమ్మినంత. దేవుడంటూ వేరే లేదు. మనమే సృష్టించుకుంటాం మన వెసలుబాటుకు. బలహీనుడు ఆసరాగా కల్పించుకున్న ఓ వింత శక్తి. అదే సర్వరక్షగా ఈ ప్రపంచాన్నీ దాని నడవడికనూ, కాపాడుతుంది. అయినా తెలిసీ తెలియని ఆ దేవుడిని అలా వుంచి అసలు 'మనిషి అనే వాడున్నాడా?' ఆ మానవత్వం లోపించే కదండి? యిలాంటి పరపీడలు చేయడం చేయించడం? అందుకే నా దృష్టిలో మనిషి మనిషిగా బ్రతికితే చాలు! అంటూ ముగించారు.

రైలు స్టేషన్లో ఆగింది. ఎన్ని వేదాలు, ఎన్నెన్ని దర్శన శాస్త్రులు ఎన్ని ఈశ్వర- నిరీశ్వర వాద ధోరణులు, ఏ ఏ ఏకతా, మానవతా, సమనతా, కారుణ్య రూప సిద్ధాంతాలు చదివితే యింత విర్దిష్టమైన పరిజ్ఞానం లభిస్తుంది? అంటూ అందరికి చేతులు జోడించి

బామ్మగారు మీ బాకీ తీరిపోయిందండి. మీ యింటికి వచ్చి మరీ తీసుకుంటాను అంటూ దిగిపోయాను.

ఆ సంభాషణ ఈనాటికి నా చెవుల్లో గింగురుమంటూనే వుంది.